నేడు విద్యుత్ ఉండని ప్రాంతాలు

చిక్కడపల్లి, జూలై 16 (ఆంధ్రజ్యోతి): ఆజామాబాద్ డివిజన్ పరిధిలో గురువారం విద్యుత్ సరఫరా ఉండదని ఏడీఈ జి.నాగేశ్వరరావు ఒక ప్రకటనలో తెలిపారు. డీడీహెచ్ పరిధిలోని విజ్ఞాన్‌పురి కాలనీ, వీఎస్టీ మెయిన్‌రోడ్ తదితర ప్రాంతాల్లో ఉదయం 10 నుంచి మధ్యాహ్నం 1 గంట వరకు, నల్లకుంట పరిధిలోని భారత్ ఇన్‌స్టిట్యూట్, విజయాబ్యాంక్ తదితర ప్రాంతాల్లో మధ్యాహ్నం 2 నుంచి 5 గంటల వరకు విద్యుత్ సరఫరా ఉండదని పేర్కొన్నారు.

కల్లు దుకాణాలపై దాడులను ప్రతిఘటించాలి


బాలకృష్ణగౌడ్‌ను సత్కరిస్తున్న నాయకుడు హిమగిరిగౌడ్ తదితరులు

నల్లకుంట, జూలై 16 (ఆంధ్రజ్యోతి): రాష్ట్రంలో కల్తీకల్లు పేరుతో రాష్ట్ర ప్రభుత్వం ఎక్సైజ్ శాఖ పేరుతో కల్లు దుకాణాలపై దాడులు చేయిస్తూ మూసి వేయించేందుకు కుట్ర చేస్తుందని నూతన తెలంగాణ గౌడ సంఘం (ఎన్‌జీఎస్) రాష్ట్ర అధ్యక్షుడు ఉడుతల బాలకృష్ణగౌడ్ ఆరోపించారు. రాష్ట్ర ప్రభుత్వ వైఖరిని అన్ని గౌడసంఘాలు తీవ్రంగా ప్రతిఘటించాల్సిన అవసరం ఉందన్నారు. బుధవారం నల్లకుంటలోని సంఘం కార్యాలయంలో గౌడ సంఘం నాయకుడు ఆర్.హిమగిరిగౌడ్ ఆధ్వర్యంలో సంఘం రాష్ట్రస్థాయి సమావేశం జరిగింది. ఈ కార్యక్రమంలో సంఘం రాష్ట్ర ఉపాధ్యక్షులు లోడ శ్రీనివాస్‌గౌడ్, ఎలికట్టే ఆనంద్‌గౌడ్, చర్లపల్లి కిరణ్‌గౌడ్, కార్యదర్శి కట్కూరి ప్రదీప్‌గౌడ్, శ్రీకాంత్‌గౌడ్, ఉడుతల రమేష్‌గౌడ్, రాఘవేందర్‌గౌడ్, ఎస్.వెంకటేష్‌గౌడ్, ఎస్.కుమార్‌గౌడ్, లక్ష్మణ్‌గౌడ్, జగన్‌గౌడ్ తదితరులు పాల్గొన్నారు.

వేంకటేశ్వరస్వామి హుండీ ఆదాయం 27.16లక్షలు

చిక్కడపల్లి, జూలై 16 (ఆంధ్రజ్యోతి): చిక్కడపల్లి వేంకటేశ్వరస్వామి ఆలయ హుండీ ఆదాయం రూ.27,16,701 వచ్చింది. బుధవారం ఆలయం సిబ్బంది, భక్తులు 112 రోజుల హుండీని దేవాదాయశాఖ ఇన్‌స్పెక్టర్ బి.సురేఖ, ఆలయ వ్యవస్థాపక వంశీయుడు రాజేంద్రనాథ్ కుమారుడు శ్రీనాథ్‌గౌడ్, ఈవో అన్నపూర్ణ పర్యవేక్షణలో లెక్కించారు. వీటిలో రూ.25,54,688 కరెన్సీ నోట్లు, రూ.1,62701 కాయిన్స్, ఫారిన్ కరెన్సీ, యూఎస్ డాలర్లు 147, సింగపూర్ డాలర్స్ 100 ఉన్నాయి. ఈ కార్యక్రమంలో చిక్కడపల్లి యూనియన్ బ్యాంక్ ఆఫ్ ఇండియా సిబ్బంది పాల్గొన్నారు.


పారిశుధ్య కార్మికులకు భద్రత కిట్లను పంపిణీ చేస్తున్న కార్పొరేటర్ అమృత

నల్లకుంట డివిజన్‌ను పరిశుభ్రంగా ఉంచుదాం

నల్లకుంట, జూలై 16 (ఆంధ్రజ్యోతి): నల్లకుంటను పరిశుభ్రమైన డివిజన్‌గా తీర్చిదిద్దేందుకు కృషి చేస్తున్నామని కార్పొరేటర్ యాకర అమృత పేర్కొన్నారు. బుధవారం నల్లకుంట డివిజన్ అభివృద్ధి కార్యాలయంలో జీహెచ్‌ఎంసీ పారిశుధ్య కార్మికులకు ఆమె భద్రత కిట్‌లను పంపిణీ చేసి మాట్లాడారు. డివిజన్‌లోని అన్ని కాలనీలు, బస్తీలలో ఎప్పటికప్పుడు చెత్త, చెదారం, మట్టి కుప్పలు లేకుండా పారిశుధ్య కార్మికులు పనిచేస్తున్నారని అన్నారు. వర్షాకాలంలో కార్మికులకు అందజేస్తున్న భద్రత కిట్‌లు ఉపయోగపడతాయని తెలిపారు. ఈ కార్యక్రమంలో జీహెచ్‌ఎంసీ శానిటరీ సూపర్‌వైజర్ వాసుదేవరెడ్డి తదితరులు పాల్గొన్నారు.

'స్థానికం'లోపే నోటిఫికేషన్స్ వేయాలి : డీవైఎఫ్ఐ

రాంనగర్, జూలై 16 (ఆంధ్రజ్యోతి): గత బీఆర్ఎస్ ప్రభుత్వం యువతకు ఉద్యోగ, ఉపాధి కల్పించడంలో పూర్తి నిర్లక్ష్యంగా వ్యవహరించిందని, ప్రస్తుత కాంగ్రెస్ ప్రభుత్వం కూడా అదే పద్ధతిలో వ్యవహరిస్తోందని భారత ప్రజాతంత్ర యువజన సమాఖ్య(డీవైఎఫ్ఐ) రాష్ట్ర అధ్యక్షుడు కోట రమేష్, కార్యదర్శి అనగంటి వెంకటేష్ ఆరోపించారు. బుధవారం సుందరయ్య విజ్ఞాన కేంద్రంలో డీవైఎఫ్ఐ ఆధ్వర్యంలో రౌండ్ టేబుల్ సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ కాంగ్రెస్ ప్రభుత్వం ఉద్యోగాల కల్పనలో కాలయాపన చేస్తోందని ఆరోపించారు. ఈ కార్యక్రమంలో నాయకులు పుట్ట లక్ష్మణ్, కిరణ్, మహేష్, జార్జిరెడ్డి, నాగేశ్వరరావు, సుమంత్, జనార్దన్, మోతీలాల్ కాశీ, అనిల్, సురేందర్ తదితరులు పాల్గొన్నారు.

'స్థానిక' ఎన్నికల్లో బ్రాహ్మణులకు సీట్లు కేటాయించాలి

నల్లకుంట, జూలై 16 (ఆంధ్రజ్యోతి): రానున్న స్థానిక సంస్థల ఎన్నికల్లో బ్రాహ్మణులకు అన్ని రాజకీయ పార్టీలు తగిన సీట్లు కేటాయించాలని తెలంగాణ బ్రాహ్మణ సేవా సమితి రాష్ట్ర అధ్యక్షుడు పోచంపల్లి రమణారావు డిమాండ్ చేశారు. బుధవారం నల్లకుంటలోని సమితి కార్యాలయంలో ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో ఆయన మాట్లాడారు. తెలంగాణ రాష్ట్రంలో ఏదైనా ఒక జిల్లాకు మాజీ ప్రధానమంత్రి పీవీ.నరసింహారావు పేరుపెట్టాలని రాష్ట్రప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు. ఈ కార్యక్రమంలో సేవా సమితి వర్కింగ్ ప్రెసిడెంట్ చెన్నూరి లక్ష్మీనరసింహారావు, కోశాధికారి పూరే ప్రసాదరావు, నాయకులు గూడ రాజేశ్వరరావు, రాఘవేందర్, గూడ జయరాం తదితరులు పాల్గొన్నారు.

'స్థానికం'లో బీసీలకు 42 శాతం అమలు చేయాలి:ఆప్

కవాడిగూడ, జూలై 16 (ఆంధ్రజ్యోతి): బీసీలకు 42 శాతం రిజర్వేషన్లు అమలు చేస్తూ హైకోర్టు ఆదేశాల మేరకు సెప్టెంబర్ 30లోపు స్థానిక సంస్థల ఎన్నికలు నిర్వహించాలని ఆమ్ ఆద్మీ పార్టీ రాష్ట్ర కన్వీనర్ డాక్టర్ దిడ్డి రాంబాబు డిమాండ్ చేశారు. బుధవారం నగరంలోని లిబర్టీ కార్యాలయంలో జరిగిన సమావేశంలో ఆయన మాట్లాడారు. ఆర్డినెన్స్ ముసాయిదాను రాష్ట్ర గవర్నర్ ఆమోదించాలని, బీజేపీ కేంద్ర మంత్రులు, ఎంపీలు కేంద్ర ప్రభుత్వంపై ఒత్తిడి తీసుకురావాలని ఆయన డిమాండ్ చేశారు. తమిళనాడు తరహా బీసీ రిజర్వేషన్ల అంశాన్ని 9వ షెడ్యూల్‌లో చేర్చాలని, అప్పుడే న్యాయం జరుగుతుందన్నారు.

బీసీ రిజర్వేషన్లను ఏబీసీడీ వర్గీకరణతో అమలు చేయాలి

చిక్కడపల్లి, జూలై 16 (ఆంధ్రజ్యోతి): తెలంగాణ రాష్ట్ర కాంగ్రెస్ ప్రభుత్వం స్థానిక సంస్థల్లో బీసీ కులాలకు 42 శాతం రిజర్వేషన్ అమలు చేయాలని నిర్ణయించడానిన బహుజన లెఫ్ట్‌పార్టీ(బహుజన కమ్యూనిస్టు) బీఎల్‌పీ తెలంగాణ రాష్ట్ర కమిటీ స్వాగతిస్తుందని అయితే 42 శాతం బీసీ రిజర్వేషన్లను ఏబీసీడీ వర్గీకరణతో అమలు చేయాలని ఆ పార్టీ రాష్ట్ర అధ్యక్షుడు దండి వెంకట్ డిమాండ్ చేశారు. బుధవారం ఆయన చిక్కడపల్లిలో విలేకరులతో మాట్లాడుతూ దేశంలోనే తమిళనాడు తర్వాత తెలంగాణ రాష్ట్రప్రభుత్వం స్థానిక సంస్థల్లో బీసీలకు 42 శాతం రిజర్వేషన్ బిల్లు తీసుకురావడం విశేషమన్నారు.

ఆ 28 కులాలను ఓబీసీ జాబితాలో చేర్చాలి


ఎంపీ ఆర్.కృష్ణయ్యకు వినతిపత్రం సమర్పిస్తున్న తెలంగాణ 28 కులాల ఓబీసీ సాధన జేఏసీ నేతలు ఈశ్వరప్ప, శివాజీ, ప్రవీణ్‌కుమార్ తదితరులు

నల్లకుంట, జూలై 16 (ఆంధ్రజ్యోతి): తెలంగాణ రాష్ట్రంలో అత్యంత వెనుకబడిన 28 కులాలను తక్షణమే ఓబీసీ జాబితాలో చేర్చేందుకు ప్రత్యేక చొరవ చూపాలని ఎంపీ ఆర్.కృష్ణయ్యకు తెలంగాణ 28 కులాల ఓబీసీ సాధన జేఏసీ నేతలు విజ్ఞప్తి చేశారు. త్వరలో జరిగే పార్లమెంట్ సమావేశాల్లో ప్రధాని నరేంద్ర మోదీ దృష్టికి తీసుకెళ్లాలన్నారు. ఈ మేరకు తెలంగాణ 28 కులాల ఓబీసీ సాధన జేఏసీ ఛైర్మన్ వెన్న ఈశ్వరప్ప, అధ్యక్షుడు చట్ట శివాజీ, వర్కింగ్ ప్రెసిడెంట్ పి.శ్రీనివాస్, ప్రధానకార్యదర్శి మోహన్‌చౌహాన్, కార్యదర్శి బోరెద ప్రవీణ్‌కుమార్, కోశాధికారి వేముల శ్రీనివాస్, నాయకుడు జాజేరావు వేదాకర్ నేతృత్వంలో ఓ ప్రతినిధి బృందం బుధవారం విద్యానగర్‌లోని బీసీ భవన్‌లో ఎంపీ ఆర్.కృష్ణయ్యను కలిసి వినతిపత్రం సమర్పించారు.

పేదలకు మెరుగైన వైద్యసేవలు


పార్శిగుట్ట వద్ద ఉచిత వైద్య శిబిరాన్ని ప్రారంభించి, పరీక్షలు చేయించుకుంటున్న ఎమ్మెల్యే ముఠా గోపాల్

ముషీరాబాద్, జూలై 16 (ఆంధ్రజ్యోతి): బస్తీల్లో ఉచిత వైద్య శిబిరాలను నిర్వహించి, పేదలకు మెరుగైన వైద్యసేవలు అందించాలని ముషీరాబాద్ ఎమ్మెల్యే ముఠా గోపాల్ అన్నారు. బుధవారం ముషీరాబాద్ డివిజన్ పార్శిగుట్ట వద్ద ఉమెన్ అండ్ చైల్డ్ వెల్ఫేర్ ఆర్గనైజేషన్, అభిషేక్ పోలీ క్లినిక్ సంయుక్త ఆధ్వర్యంలో నిర్వహించిన ఉచిత మెగావైద్య శిబిరాన్ని ఎమ్మెల్యే ప్రారంభించారు. ఈ సందర్భంగా గైనకాలజీ, డెంటల్, ఫిజియోథెరపీ, బీపీ, షుగర్, రక్త తదితర వైద్య పరీక్షలు నిర్వహించారు. 500 మందికి పరీక్షలు చేసి అవసరమైన వారికి ఉచితంగా మందులను పంపిణీ చేశారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే మాట్లాడుతూ...ప్రభుత్వంతోపాటు ప్రైవేటు వైద్యసంస్థలు మానవతదృక్పథంతో పేదలకు మెరుగైన వైద్య సేవలు అందించాలన్నారు. ఈ కార్యక్రమంలో ఉమెన్ అండ్ చైల్డ్ వెల్ఫేర్ ఆర్గనైజేషన్ అధ్యక్షుడు డాక్టర్ అశోక్, మెడికల్ మిషన్ హెడ్ డాక్టర్ అభిషేక్, బీఆర్ఎస్ ముషీరాబాద్ డివిజన్ అధ్యక్షుడు శ్రీధర్‌రెడ్డి, పార్టీ సీనియర్ నాయకుడు శివముదిరాజ్, శ్రీధర్‌చారి, డివిజన్ వాణిజ్య విభాగం అధ్యక్ష, కార్యదర్శులు టెంట్‌హౌస్ శ్రీనివాస్, వెంకటేశ్వర్‌రావు, సీనియర్ నాయకులు ముచ్చకుర్తి ప్రభాకర్, డాక్టర్ అంజీలీనా, డాక్టర్ వంశీ, డాక్టర్ అన్నిరోజ్, డాక్టర్ ప్రేమలీల, డాక్టర్ బాబూరావు తదితరులు పాల్గొన్నారు.

రాజకీయాలకతీతంగా అభివృద్ధి


డ్రైనేజీ పైపులైన్ పనులను ప్రారంభిస్తున్న ఎమ్మెల్యే కాలేరు వెంకటేష్, కార్పొరేటర్ దూసరి లావణ్యశ్రీనివాస్‌గౌడ్

గోల్నాక, జూలై 16 (ఆంధ్రజ్యోతి): అంబర్‌పేట నియోజకవర్గంలో ఎలాంటి రాజకీయాలకు తావు ఇవ్వకుండా అందరినీ కలుపుకుని అభివృద్ధియే ధ్యేయంగా పనిచేస్తున్నానని అన్నారు. ఎన్నికలప్పుడే ఎవరు ఏం చేశారో ప్రజలకు వివరించడంతో వారే సరైన నిర్ణయం తీసుకుని అభివృద్ధికి పట్టం కడుతారని ఆయన చెప్పారు. తానెప్పుడు ఎలాంటి రాజకీయ విమర్శలు, ఆరోపణలు చేయనని ప్రజాసమస్యలను పరిష్కరించుకుంటూ వెళ్తానన్నారు. బుధవారం గోల్నాక డివిజన్ వడ్డెరబస్తీలో రూ.13లక్షల వ్యయంతో నిర్మిస్తున్న డ్రైనేజీ పైపులైన్ పనులను కార్పొరేటర్ దూసరి లావణ్యశ్రీనివాస్‌గౌడ్‌తో కలిసి ఎమ్మెల్యే కాలేరు వెంకటేష్ ప్రారంభించారు. అనంతరం వారు స్థానికులను కలుసుకుని సమస్యలను అడిగి తెలుసుకున్నారు. ఈ కార్యక్రమంలో జలమండలి జీఎం శ్రీధర్, ఏఈ రోహిత్, ఏఎంహెచ్‌వో డాక్టర్ హేమలత, బీఆర్ఎస్ నాయకులు గండికోట జనార్దన్, ఆర్.కె.బాబు, ఎ.సురేష్‌గౌడ్, బిక్షయ్య, బాలరాజు, నిమ్మల యాదగిరి, రుద్రయ్య, కరుణాకర్‌గౌడ్, ఉమేష్, బోదాసు శేఖర్, స్థానికులు గగండికోట శ్రీనివాస్, వరుకుప్పల విజయ్, వరికుప్పల సత్యనారాయణ, గండకోట జంగయ్య, వరికుప్పల శ్రీనివాస్, వరికుప్పల ఉపేందర్, మహిళలు పాల్గొన్నారు.

దివ్యాంగుల సంక్షేమానికి మోదీ కృషి : బీజేపీ


దివ్యాంగులకు ధ్రువపత్రాలను అందజేస్తున్న బీజేపీ ముషీరాబాద్ కన్వీనర్ రమేష్‌రాం, కార్పొరేటర్ సుప్రియ

ముషీరాబాద్, జూలై 16 (ఆంధ్రజ్యోతి): అన్నివర్గాల ప్రజలతో పాటు దివ్యాంగుల సంక్షేమానికి ప్రధాని మోదీ కృషి చేస్తున్నారని బీజేపీ ముషీరాబాద్ నియోజకవర్గం కన్వీనర్ రమేష్‌రాం అన్నారు. బుధవారం భోలక్‌పూర్, కవాడిగూడ తాళ్లబస్తీ కమ్యూనిటీ హాల్‌లో కేంద్రమంత్రి కిషన్‌రెడ్డి ఆధ్వర్యంలో ముషీరాబాద్ నియోజకవర్గంలోని దివ్యాంగులకు సహాయ పరికరాల ఎంపిక శిబిరాన్ని నిర్వహించారు. ఈ సందర్భంగా వివిధ రకాల వైద్యులు హాజరై దివ్యాంగులకు పరీక్షలు నిర్వహించి, వారిని ఎంపిక చేశారు. ఈ సందర్భంగా లబ్ధిదారులకు సర్టిఫికెట్లను రమేష్‌రాం అందజేశారు. కార్యక్రమంలో బీజేపీ దివ్యాంగుల విభాగం రాష్ట్ర కన్వీనర్ కొల్లి నాగేశ్వర్‌రావు, బీజేపీ పార్లమెంట్ నియోజకవర్గం కన్వీనర్ రాజశేఖర్‌రెడ్డి, కార్పొరేటర్ సుప్రియా నవీన్‌గౌడ్, ఓబీసీ మోర్చా జాతీయ కార్యవర్గ సభ్యుడు పూసరాజు, నియోజకవర్గం మీడియాసెల్ ఇన్‌చార్జి బిజ్జి కనకేష్‌కుమార్, మహాకాళి జిల్లా ప్రధానకార్యదర్శి సారంగపాణి, దిశాకమిటీ సభ్యుడు నందగిరి నర్సింహ, బీజేపీ నియోజకవర్గం జాయింట్ కన్వీనర్లు రఘు, మహేష్‌కుమార్, రాష్ట్ర నాయకులు బొల్లంపల్లి రాంరెడ్డి, కృష్ణ చంద్రమోహన్ తదితరులు పాల్గొన్నారు.


విద్యార్థులకు నోటు పుస్తకాలు, స్టేషనరీ సామగ్రిని అందజేస్తున్న కాంగ్రెస్ సికింద్రాబాద్ జిల్లా ప్రధాన కార్యదర్శి శ్రీకాంత్‌గౌడ్ తదితరులు

విద్యార్థులు చదువుకున్నప్పుడే ఉజ్వల భవిష్యత్

ముషీరాబాద్, జూలై 16 (ఆంధ్రజ్యోతి): విద్యార్థులు క్రమశిక్షణతో బాగా చదువుకున్నప్పుడే ఉజ్వల భవిష్యత్ ఉంటుందని కాంగ్రెస్ సికింద్రాబాద్ జిల్లా ప్రధాన కార్యదర్శి లింగాల శ్రీకాంత్‌గౌడ్ అన్నారు. బుధవారం లింగాల చంద్రకళ నామదాసుగౌడ్ చారిటబుల్ ట్రస్ట్ ఆధ్వర్యంలో ముషీరాబాద్, మొరంబొంద ప్రభుత్వ ప్రాథమిక పాఠశాల విద్యార్థులకు నోటు పుస్తకాలు, స్టేషనరీ వస్తువులను పంపిణీ చేశారు. కాంగ్రెస్ సికింద్రాబాద్ జిల్లా ఉపాధ్యక్షుడు మీసాల జైకుమార్, మురళీమోజెస్, పట్నం నాగభూషణంగౌడ్, భవానీశంకర దేవాలయ కమిటీ ఛైర్మన్ మేడి సురేష్‌కుమార్, నాయకులు రాజ్‌దీప్, లింగంగుప్తా, కాంగ్రెస్ ముషీరాబాద్ డివిజన్‌మాజీ అధ్యక్షుడు జీఎన్.చారి, నాయకులు రమేష్‌గౌడ్, రాజు, మధు, ప్రేమ్‌కుమార్, అమరేందర్‌గౌడ్ తదితరులు పాల్గొన్నారు.

అమ్మవారి దేవాలయాల అభివృద్ధికి కృషి


ఆభరణాలను అమ్మవారికి సమర్పిస్తున్న కార్పొరేటర్ పావనివినయ్‌కుమార్

చిక్కడపల్లి, జూలై 16 (ఆంధ్రజ్యోతి): గాంధీనగర్ డివిజన్‌లోని అమ్మవారి దేవాలయాల అభివృద్ధి కోసం తమవంతు సహాయసహకారాలు అందజేయడం అదృష్టంగా భావిస్తున్నామని కార్పొరేటర్ ఎ.పావనివినయ్‌కుమార్ అన్నారు. బుధవారం అరుంధతినగర్ బస్తీ కట్టమైసమ్మ తల్లి దేవాలయంలోని అమ్మవారి విగ్రహానికి వెండి తొడుగును కార్పొరేటర్ సమర్పించారు. అమ్మవారి విగ్రహానికి సుమారు 71 తులాల వెండితో చతుర్భుజాలు, వెండి తొడుగులను కార్పొరేటర్ దంపతులు అలంకరించారు. ఈ సందర్భంగా కార్పొరేటర్ మాట్లాడుతూ దేవాలయాలను కాపాడుకోవడం మన హిందూ ధర్మం అని అన్నారు. ఈ కార్యక్రమంలో బీజేపీ సికింద్రాబాద్ పార్లమెంటు జాయింట్ కన్వీనర్ ఎ.వినయ్‌కుమార్, నాయకులు రత్నసాయిచంద్, శ్రీకాంత్, శివకుమార్, సురేష్, ఆనంద్‌రావు, సాయికుమార్, జ్ఞానేశ్వర్, బస్తీ కమిటిసభ్యులు రాజు, రాజు, యాదగిరి, నాగుల ప్రకాష్, శ్రీనివాస్‌గౌడ్, మెరుగు శ్రీనివాస్‌యాదవ్, సరస్వతి, రాములమ్మ, నీలమ్మ, భారతమ్మ తదితరులు పాల్గొన్నారు.

జీవో 282ను రద్దు చేయాలి: బీఆర్‌టీయూ

చిక్కడపల్లి, జూలై 16 (ఆంధ్రజ్యోతి): జీవో 282ను రద్దు చేయాలని, లేకపోతే ఉద్యమం ఉధృతం చేస్తామని బీఆర్‌టీయూ ఆధ్వర్యంలో నేతలు డిమాండ్ చేశారు. ఈ మేరకు బుధవారం తెలంగాణ కార్మిక కమిషనరేట ఎదుట బీఆర్‌టీయూ రాష్ట్ర రాంబాబుయాదవ్, నాయకులు నారాయణ, వేముల మారయ్య నాయకత్వంలో ధర్నా చేశారు. రాంబాబుయాదవ్ మాట్లాడుతూ రాష్ట్రప్రభుత్వం కార్మికులకు మంచి చేయకపోగా ఉన్న ప్రయోజనాలు, సాధించుకున్న హక్కులను కాలరాస్తోందన్నారు. ఈ కార్యక్రమంలో యూనియన్‌నాయకులు శివశంకర్, రాముడుయాదవ్, ఎల్లమయ్య, చెన్నయ్య, రమేష్, లక్ష్మారెడ్డి, రవికుమార్, సాంబశివుడు, మాధవరావు, శంకర్‌రెడ్డి, రవిసింగ్, చారి.కిరణ్, మహేందర్, అజీజ్, మధు, రాందాస్ తదితరులు పాల్గొన్నారు.

24న వండర్ బుక్ ఆఫ్ రికార్డ్ ఇంటర్నేషనల్

రాంనగర్, జూలై 16 (ఆంధ్రజ్యోతి): శ్రీచార్వీ ఆర్ట్స్ అండ్ కల్చరల్ అసోసియేషన్ సాంస్కృతిక సేవా సంస్థ ఈవెంట్స్ ఆధ్వర్యంలో ఈనెల 24న ఆర్టీసీ క్రాస్‌రోడ్స్‌లోని కళాభారతి సిటీ కల్చరల్ సెంటర్‌లో వండర్ బుక్ ఆఫ్ రికార్డ్ ఇంటర్నేషనల్ కార్యక్రమం నిర్వహిస్తున్నట్లు సంస్థ వ్యవస్థాపక అధ్యక్షుడు, గాయకుడు కాసర్ల సురేష్ తెలిపారు. బుధవారం రాంనగర్‌లో ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో ఆయన మాట్లాడారు. ఈ కార్యక్రమానికి ప్రముఖ సినీనటులు సుమన్, బాబు మోహన్, ఎంపీ అనిల్‌కుమార్‌యాదవ్, ఎమ్మెల్యే ముఠా గోపాల్, వండర్ బుక్ ఆఫ్ రికార్డ్ ఇండియన్ చీఫ్ కో-ఆర్డినేటర్ బింగి నరేందర్‌గౌడ్ తదితరులు హాజరవుతారని ఆయన తెలిపారు.

'ఆ వీసీ నియామకం తెలుగు భాషాభివృద్ధికి అవరోధం'

రాంనగర్, జూలై 16 (ఆంధ్రజ్యోతి): తెలుగు యూనివర్సిటీ వీసీగా నిత్యానందరావు నియామకం తెలుగు భాషాభివృద్ధికి అవరోధం అని టీడీపీ సికింద్రాబాద్ పార్లమెంట్ నియోజకవర్గం అధ్యక్షుడు పి.సాయిబాబా ఆరోపించారు. బుధవారం పార్టీ నగర కార్యాలయంలో జరిగిన సమావేశంలో ఆయన మాట్లాడుతూ తెలుగు భాష పట్ల ఏ మాత్రం అవగాహన లేని వ్యక్తి అని పేర్కొన్నారు. ఈ కార్యక్రమంలో టీడీపీ నాయకులు నల్లెల కిషోర్, పి.బాల్‌రాజ్‌గౌడ్, సి.ప్రకాష్ తదితరులు పాల్గొన్నారు.

ముగిసిన చండీయాగం

బర్కత్‌పుర, జూలై 16 (ఆంధ్రజ్యోతి): తెలంగాణ రాష్ట్ర సర్వతోముఖాభివృద్ధిని ఆకాంక్షిస్తూ లోకకల్యాణం కోసం దూపదీప నైవేద్య సంఘం తెలంగాణ శాఖ ఆధ్వర్యంలో కాచిగూడ తుల్జాభవన్‌లో మూడు రోజుల పాటు నిర్వహించిన పంచకుండాత్మక చండీ కుబేర పాశుపతాయాగం బుధవారం ముగిసింది. చివరి రోజు గణపతిపూజ, మూలమంత్ర అనుష్ఠానాలు, దేవతా హోమాలు నిర్వహించారు. తెలంగాణ ప్రభుత్వానికి వేద మహదాశీర్వచనం నిర్వహించారు. అనంతరం వేద పండితులను సన్మానించారు. ఈ వేడుకల్లో కేంద్ర మాజీమంత్రి సముద్రాల వేణుగోపాలచారి, కాచిగూడ కార్పొరేటర్ కన్నె ఉమాదేవి, బీజేపీ సెంట్రల్ జిల్లా ఉపాధ్యక్షుడు కన్నె రమేష్‌యాదవ్, సంఘం అధ్యక్షుడు వాసుదేవశర్మ, ప్రసాద్‌శర్మ, వెంకటాద్రి స్వామి, రామలింగేశ్వరశర్మ, లక్ష్మీనర్సయ్యశర్మ, గంగు కృష్ణచైతన్య, నాగదక్షిణమూర్తి, కుమార్‌శర్మ, హరికిషన్‌శర్మ పాల్గొన్నారు.

బీసీ సంఘాల ఐక్యవేదిక ఉపాధ్యక్షుడిగా కృష్ణగౌడ్



బర్కత్‌పుర, జూలై 16 (ఆంధ్రజ్యోతి): బీసీ కుల సంఘాల ఐక్యవేదిక అంబర్‌పేట నియోజకవర్గం ఉపాధ్యక్షుడిగా కాచిగూడ డివిజన్ మోతిమార్కెట్‌కు చెందిన బి.కృష్ణగౌడ్ నియమితులయ్యారు. ఈ మేరకు ఐక్యవేదిక అధ్యక్షుడు ఎ.వెంకటేష్‌గౌడ్ బుధవారం ఉత్తర్వులు జారీచేశారు.

పెండింగ్ బిల్లులు విడుదల చేయాలి



నారాయణగూడ చౌరస్తా వద్ద పీడీఎస్‌యూ నేతల నిరసన

నల్లకుంట, జూలై 16 (ఆంధ్రజ్యోతి): విద్యారంగం పట్ల గత బీఆర్ఎస్ ప్రభుత్వం మాదిరిగానే ప్రస్తుత కాంగ్రెస్ ప్రభుత్వం నిర్లక్ష్యంగా వ్యవహరిస్తుందని ప్రగతిశీల ప్రజాస్వామ్య విద్యార్థి సంఘం (పీడీఎస్‌యూ) రాష్ట్ర ప్రధానకార్యదర్శి సాంబ ఆరోపించారు. పదేళ్లుగా రాష్ట్రంలో పేదవిద్యార్థులకు అందాల్సిన స్కాలర్‌షిప్‌లు, ఫీజురీయింబర్స్‌మెంట్ సుమారు రూ.8 వేల కోట్లు పెండింగ్‌లో ఉన్నాయని, వాటిని వెంటనే విడుదల చేయాలని డిమాండ్ చేశారు. ఈ మేరకు బుధవారం నారాయణగూడ చౌరస్తాలో నిరసన కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా సీఎం రేవంత్‌రెడ్డికి విద్యార్థులు పోస్టుకార్డులను పంపారు. ఈ కార్యక్రమంలో పీడీఎస్‌యూ నాయకులు కె.గణేష్, వంశీ, సుధీర్, రాధిక తదితరులు పాల్గొన్నారు.

దేవాలయంలో చోరీ.. నిందితుడి అరెస్ట్


నిందితుడు శ్రీనివాస్‌ను అరెస్ట్ చేసిన అంబర్‌పేట పోలీసులు

అంబర్‌పేట, జూలై 16 (ఆంధ్రజ్యోతి): జైలు నుంచి వచ్చిన నెల రోజుల లోపే మరో దొంగతనానికి పాల్పడిన పాత నేరస్తుడిని అంబర్‌పేట పోలీసులు బుధవారం అరెస్ట్ చేసి రిమాండ్‌కు తరలించారు. సీఐ కిరణ్‌కుమార్ తెలిపిన ప్రకారం.. ఆల్మాస్‌గూడ లక్ష్మీనగర్‌లో నివాసం ఉండే శ్రీనివాస్ అంబర్‌పేటలో టిఫిన్ సెంటర్ నిర్వహిస్తున్నాడు. డబ్బులు సరిపోకపోవడంతో గతంలో బైక్ దొంగతనానికి పాల్పడి జైలుకు వెళ్లి దాదాపు 25 రోజుల క్రితం బయటకు వచ్చాడు. ఈనెల 11న అంబర్‌పేట ప్రేమ్‌నగర్‌లోని శ్రీహనుమాన్ దేవాలయం తలుపులు పగులగొట్టి, ఆలయంలో ఉన్న రాజరాజేశ్వరి దేవీ అమ్మవారి పంచలోహ విగ్రహాన్ని చోరీ చేశాడు. ఈ విషయంపై అంబర్‌పేట డీఐ హబీబుద్దీన్ ఆధ్వర్యంలో పోలీసులు సీసీ కెమెరా పరిశీలించగా గోల్నాక జిందాతిలిస్మాత్ వద్ద శ్రీనివాస్ తిరుగుతూ విగ్రహాన్ని అమ్మడానికి ప్రయత్నించడం గమనించారు. దీంతో అతన్ని అదుపులోకి తీసుకుని విచారించగా నేరాన్ని అంగీకరించాడు. పంచలోహ విగ్రహాన్ని స్వాధీం చేసుకుని, నిందితుడిని రిమాండ్‌కు తరలించారు.

లైబ్రరీ సైన్స్‌లో గుమ్మడి శాంతికి డాక్టరేట్


గైడ్ రవికుమార్‌కు థీసిస్‌బుక్ అందజేస్తున్న గుమ్మడి శాంతి

అంబర్‌పేట, జూలై 16 (ఆంధ్రజ్యోతి): ఇటీవల ఉస్మానియా యూనివర్సిటీ ప్రకటించిన డాక్టరేట్లలో గాంధీ మెడికల్ కాలేజీ లైబ్రేరియన్ గుమ్మడి శాంతికి లైబ్రరీ సైన్స్‌లో డాక్టరేట్ లభించింది. సిటీ కళాశాల అసిస్టెంట్ ప్రొఫెసర్ చేగోని రవికుమార్ పర్యవేక్షణలో యూజ్ ఆఫ్ యూనివర్సిటీ లైబ్రరీ వెబ్‌సైట్ బై ది ఫ్యాకల్టీ అండ్ రీసెర్చ్ స్కాలర్స్ ఇన్ తెలంగాణ ఏ కేస్ స్టడీ అనే అంశంపై ఆమె పరిశోధన చేశారు. గ్రంథాలయ శాస్త్ర అభివృద్ధికి తనవంతు కృషి చేస్తానని ఆమె పేర్కొన్నారు. తనకు పీహెచ్‌డీకి సహకరించిన గైడ్ చేగని రవికుమార్, అధ్యాపకులు యాదగిరి, వివేకవర్ధన్, చక్రవర్తి, లక్‌పతినాయక్, అచల తదితరులకు ఆమె కృతజ్ఞతలు తెలియజేశారు.

బోనాల పండుగకు ఆలయాల వద్ద ఏర్పాట్లు

రాంనగర్, జూలై 16 (ఆంధ్రజ్యోతి): రాంనగర్ డివిజన్‌లో ఈ నెల 20, 21వ తేదీల్లో జరిగే బోనాల పండగ సందర్భంగా డివిజన్‌లోని ఆలయాల పరిసర ప్రాంతాల్లో మౌలిక సదుపాయాలు కల్పించాలని, ఫలహారం బండ్ల ఊరేగింపు మార్గంలో రోడ్లపై ఎలాంటి గుంతలు లేకుండా చూడాలని కార్పొరేటర్ కె.రవిచారి జీహెచ్‌ఎంసీ అధికారులకు సూచించారు. బుధవారం బాకారం మెయిన్ రోడ్డులో గుంతలను పూడ్చే పనులను ముషీరాబాద్ సర్కిల్ డీఈ గీత, ఏఈ వినోద్‌కుమార్ ఆధ్వర్యంలో పరిశీలించారు.

మహాకాళి అమ్మకు పట్టువస్త్రాలు సమర్పిస్తా


అంబర్‌పేట బోనాలకు రావాలని మేయర్ విజయలక్ష్మికి ఆహ్వాన పత్రం అందజేస్తున్న మాజీ కార్పొరేటర్ పద్మావతి తదితరులు

రాంనగర్, జూలై 16 (ఆంధ్రజ్యోతి): అంబర్‌పేట మహాకాళి అమ్మకు దేవాదాయ శాఖ తరఫున పట్టువస్త్రాలు సమర్పిస్తామని మేయర్ గద్వాల విజయలక్ష్మి అన్నారు. ఆలయంలో ఈనెల 20, 21వ తేదీలలో నిర్వహించే బోనాల పండుగకు రావాలని ఆలయ కమిటీ ప్రతినిధులు, మాజీ కార్పొరేటర్ కె.పద్మావతిడీపీరెడ్డి, రంగంపల్లి రాజు, గడ్డం శ్రీధర్‌గౌడ్, గడ్డం సునీల్‌గౌడ్, పుట్ట సందీప్, రోహన్‌గౌడ్, బిందు సాయిరాం తదితరులు కోరారు. ఈ మేరకు బుధవారం మేయర్ విజయలక్ష్మిని కలిసి ఆహ్వానపత్రం అందజేశారు.

బోనాలకు దేవాలయం ముస్తాబు

రాంనగర్: అడిక్‌మెట్ డివిజన్‌లోని నల్లపోచమ్మ, ముత్యాలమ్మ, నాగమ్మ దేవాలయం బోనాల ఉత్సవాలకు ముస్తాబైంది. ఆలయ కమిటీ ఛైర్మన్ రాజేశ్వరిగౌడ్, ప్రధానకార్యదర్శి నర్సింగ్ ముదిరాజ్ పర్యవేక్షణలో ఆలయానికి రంగులు వేశారు. భక్తులు అధిక సంఖ్యలో పాల్గొని అమ్మవారి కృపకు పాత్రులు కావాలని కోరారు.

సీనియర్ ఫొటోగ్రాఫర్ షేక్ నసీర్ మృతి



నల్లకుంట, జూలై 16 (ఆంధ్రజ్యోతి): మున్సిఫ్ డైలీ న్యూస్ పేపర్ సీనియర్ ఫొటోగ్రాఫర్ షేక్ నసీర్ మృతి చెందాడు. ఆయన మృతి పట్ల తెలంగాణ వర్కింగ్ జర్నలిస్ట్ ఫెడరేషన్ (టీడబ్ల్యూజేఎఫ్) రాష్ట్ర అధ్యక్షుడు మామిడి సోమయ్య బుధవారం తీవ్ర సంతాపం వ్యక్తంచేశారు. ఆయన కొంతకాలంగా అనారోగ్యంతో చికిత్స పొందుతూ పరిస్థితి విషమించి, మృతి చెందడం బాధాకరమన్నారు. నసీర్ మృతికి సంతాపం, ఆయన కుటుంబ సభ్యులకు ప్రగాఢ సానుభూతిని తెలియజేశారు.

10 డ్రంకెన్ డ్రైవ్ కేసులు నమోదు


బర్కత్‌పురచౌరస్తా వద్ద డ్రంకన్‌డ్రైవ్ నిర్వహిస్తున్న ట్రాఫిక్ పోలీసులు

బర్కత్‌పుర, జూలై 16 (ఆంధ్రజ్యోతి): కాచిగూడ ట్రాఫిక్ పోలీస్ స్టేషన్ ఆధ్వర్యంలో బుధవారం మధ్యాహ్నం నిర్వహించిన డ్రంకెన్ డ్రైవ్‌లో 10 కేసులు నమోదైనట్లు ట్రాఫిక్ సీఐ శ్రీనివాస్ తెలిపారు. నగర పోలీసు కమిషర్ సీవీ.ఆనంద్, ట్రాఫిక్ జాయింట్ సీపీ జోయల్ డేవిస్ ఆదేశాలకు అనుగుణంగా బర్కత్‌పుర చౌరస్తా వద్ద డ్రంకెన్ డ్రైవ్ తనిఖీలు నిర్వహించామని తెలిపారు. ఏ సమయంలోనైనా డ్రంకెన్‌డ్రైవ్ నిర్వహిస్తామన్నారు. బర్కత్‌పుర చౌరస్తా వద్ద పదిమందిపై కేసులు నమోదు చేశామని వారిని కోర్టులో హాజరుస్తామని తెలిపారు.

చిక్కడపల్లిలో 9 మంది..

చిక్కడపల్లి, జూలై 16 (ఆంధ్రజ్యోతి): చిక్కడపల్లి ట్రాఫిక్ పోలీసులు బుధవారం సాయంత్రం డ్రంకెన్‌డ్రైవ్ తనిఖీలు నిర్వహించారు. నగర పోలీసు కమిషనర్ చేపట్టిన 24/7బ్రీత్ టెస్ట్, డ్రంక్ డ్రైవ్ అణిచివేత కార్యక్రమంలో భాగంగా ట్రాఫిక్ జాయింట్ పోలీస్ కమిషనర్ సూచనల మేరకు చిక్కడపల్లి, రామ్‌నగర్ తదితర ప్రాంతాల్లో ఇన్‌స్పెక్టర్ ఎం. వీరేశం, ఎస్ఐలు డి.యాదగిరి, కె.సాయిరామ్, పి.సుందర్‌రాజ్ తనిఖీలు నిర్వహించారు. 9 మంది మద్యం సేవించి వాహనాలు నడుపుతూ పట్టుబడ్డారు. వీరిలో ముగ్గురు ఆటోడ్రైవర్లు ఆరుగురు బైకర్లు ఉన్నారని, వారిపై కేసులు నమోదు చేసినట్లు ఇన్‌స్పెక్టర్ తెలిపారు.